గుండెల మీద గులాబీ
మనసంతా ఉప్పొంగే
బీఆర్ఎస్ జెండా భుజాన ఎత్తుకుంటే
గుండె ధైర్యం ఉండే

కేసీఆర్ సారుతోనే
తెలంగాణ సల్లంగ ఉండే
కారుకు ఓటేద్దాం
కేసీఆర్ వెంట నడుద్దాం

-చిటుకుల మైసారెడ్డి

**91827 77222**

హ్యాట్రిక్ ఎలక్షన్- హ్యాట్రిక్ కేసీఆర్ కాన్సెప్ట్‌తో అసెంబ్లీ ఎన్నికల స్పెషల్ 'తెలంగాణ జైత్రయాత్ర'కు మీ నినాదాలు పంపాల్సిన వాట్సాప్ నెంబర్ ఇదీ.. మీ పేరు పంపడం మర్చిపోకండి.

## నాడు-నేడు

• రాతి గుండెలు.. ఇనుప ట్యాంకులు..




ఫ్లోరైడ్ రక్కసి నల్లగొండ జిల్లాలో కొన్ని తరాలను కోలుకోలేని దెబ్బతీసింది. గుక్కెడు మంచినీళ్లు ఇచ్చి మా బతుకులు కాపాడండి అని ఎంత మొత్తుకున్నా నాటి రాతి గుండెలు కరగలేదు. కంటితుడుపు చర్యగా మునుగోడులో 1994లో రూ.18 లక్షలతో డీఫ్లోరినేషన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది అప్పటి ప్రభుత్వం. కానీ, మునుగోడు గోడు తీరింది కాదు. నెలలు తిరిగేసరికి ఇనుప ట్యాంకులు చిలుం పట్టిపోయాయి. మునుగోడు, చుట్టుపక్కల గ్రామాల ఫ్లోరైడ్ కష్టాలు మరో రెండు దశాబ్దాలు కొనసాగాయి.

• నిండు మనసులు.. శుద్ధ జలాలు




తెలంగాణ వచ్చాక ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ పీడ విరగడైంది. ఫ్లోరైడ్‌పై పోరులో భాగంగా నాంపల్లి మండలంలోని ఎస్‌డబ్ల్యూ లింగోటం గ్రామంలో 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. రూ.25.50 కోట్లతో దీనిని నిర్మించారు. శుద్ధిచేసిన జలాలతో మునుగోడువాసుల గొంతు తడిపారు. ఈ ప్లాంట్ నుంచి మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలు, పోచంపల్లి మున్సిపాలిటీ, మొత్తంగా 301 గ్రామాలకు శుద్ధజలాలు సరఫరా అవుతున్నాయి.

### ఫన్‌టాస్టిక్



## దొంగలకూ హక్కులుంటాయా ?

**తెలంగాణ** ఇచ్చిన కాంగ్రెస్‌కే అధికారం అప్పగించాలనే డిమాండ్ వినిపిస్తున్నది ..

ఔను చాలా గట్టిగా డిమాండ్ చేస్తున్నారు ...

**యూపీఏ హయాంలోనే తెలంగాణ వచ్చింది కదా ? వాళ్ళ డిమాండ్ మీద నువ్వేమంటావ్ ?**

నేను ఏమంటే ఏముంది? 2014, 2018లో ఇదే డిమాండ్ వినిపించారు, ప్రజలు ఈ డిమాండ్ పై ఏం చెప్పాలో అది చెప్పారు ..

**ప్రజలు చెప్పారు, సరే నీ అభిప్రాయం చెప్పు ?**

ముందు నేనో కథ చెబుతా అది విన్నాక నా ప్రశ్నకు నువ్వు సమాధానం చెబితే, నీ ప్రశ్నకు సమాధానం చెబుతా ..

**సరే కథ చెప్పు ?**

పిల్లా పాపలతో హాయిగా ఉన్న ఓ కుటుంబంలో ఓ దొంగోడు బంగారు గొలుసు ఎత్తు కెళ్ళాడు .. గొలుసు పోయిన బాధలో ఆ కుటుంబం చాలా కాలం నానా యాతన పడ్డది..

ఇక మన గొలుసు దొరకదు... మన నుదిటి రాత ఇంతే ... అని తల్లిదండ్రులు బాధల్లోనే జీవితం గడిపారు ... పిల్లలు పెద్ద వాళ్ళు అయ్యాక మన జీవితం ఇలా ఎందుకు ఉందని తల్లిదండ్రులను అడిగారు... వారు పిల్లలకు విషయం చెప్పి మన బంగారు గొలుసు మన వద్ద ఉన్నంత కాలం మన పరిస్థితి బాగానే ఉండేది ..

మన కుటుంబ జీవితం బాగుపడాలంటే గొలుసు మనకు దక్కితేనే సాధ్యం అవుతుంది అని గ్రహించి పిల్లలు గొలుసు కోసం అన్వేషణ మొదలు పెట్టారు ....

చేయి తిరిగిన, పేరు మోసిన దొంగ వద్ద ఆ బంగారు గొలుసు ఉందని గ్రహించిన పిల్లలు దొంగపై యుద్ధం ప్రకటించారు ...

ఒకసారి ఎత్తుకొచ్చాను ఇక అంతే దీనిపై సర్వహక్కులు నావే అంటూ వాదిస్తూ వచ్చిన దొంగ చివరి వరకు బంగారు గొలుసు తన వద్దనే ఉంచుకోవడానికి ప్రయత్నించాడు ...

ఐనా పట్టు వదలకుండా కలో గంజో తాగి బతుకుతాం, మా గొలుసు మాకు ఇవ్వాల్సిందే అని పట్టు పట్టారు .

గొలుసు ఇవ్వక పోతే ఊపిరి ఆగిపోతుంది అని భయపడి దొంగ గొలుసు ఇచ్చేశాడు ...

తల్లిదండ్రులు మొదటి నుంచి నమ్మినట్టుగానే ఆ కుటుంబం చేతికి బంగారు గొలుసు రాగానే ఆ కుటుంబం పచ్చగా కళకళలాడుతున్నది ...అలా కొంత కాలం గడిచింది .

నేనిచ్చిన గొలుసు వల్లనే మీ కుటుంబం కళకళ లాడుతున్నది... నేను కాకుండా మరే దొంగ చేతిలో ఉన్నా ఆ గొలుసు మీకు దక్కేది కాదు ... గొలుసు నేనే ఇచ్చాను కాబట్టి దాని మీద హక్కులు నావే, ఆ బంగారు గొలుసు తనకు ఇచ్చేయాలని దొంగ డిమాండ్ ... చేస్తున్నాడు ... అతను చెప్పిన దానిలో కొంత నిజం ఉంది ... గొలుసు అతను ఇచ్చింది నిజమే ... ఐతే ఆ గొలుసు అతను దొంగతనం చేసింది కూడా నిజమే ...

**సరే కథ విన్నావు కదా ? ఇప్పుడు చెప్పు ఆ దొంగ వాదనలో న్యాయం ఉన్నదా? బంగారు గొలుసు అతనికి ఇవ్వాలా ? చెప్పు?**

ఆ దొంగతో వాదనలు , చర్చలు ఏమిటీ? బంగారు గొలుసు ఎత్తు కెళ్ళి బంగారం లాంటి మా కుటుంబంలో చిచ్చు పెట్టావని అర చేతి వాతలు చెంప మీద వాయించి పంపకుండా ఆలోచిస్తావా ?

**ఆ దొంగ వాదనలో న్యాయం ఉందని ఢిల్లీ నుంచి పెద్ద వాళ్ళను తీసుకు వచ్చి చెప్పిస్తున్నారు ...ఏం చేయాలి ?**

గల్లీ వాడు చెప్పినా , ఢిల్లీ వాడు చెప్పినా దొంగ దొంగే ... దొంగతనం చేసిందే తప్పు ... ఇంకా హక్కుల గురించి వాదిస్తున్నాడా ?

**అంతే అంటావా ?**

అంతే .... ఈ మాట చెప్పడానికి మేధావులు అవసరం లేదు ..

ఎవరైనా ఇదే మాట చెబుతారు ....

దొంగ దొంగే

*****

ఐతే తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ కు తెలంగాణ అప్పగించాలి అనే డిమాండ్ కు నా సమాధానం ఇదే .... ఎత్తు కెళ్లిన వారికి అడిగే హక్కు ఉండదు ...పైగా ఎత్తు కెళ్ళినందుకు శిక్ష అనుభవించాలి.

■ మురళి

*ఓ ట్రాక్టర్ కొనుక్కోవాలని, ఊర్లోనే దర్జాగా బతకాలనేది బేగరి రాజుకు పదేండ్ల నుంచి ఉన్న కల. ఆయనది కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం బండపల్లి గ్రామం. ట్రాక్టర్ కొనాలంటే ముందు లక్షనో, రెండు లక్షలో కట్టి మిగతాది ఫైనాన్స్ తీసుకోవాలి. ముందు కట్టడానికి పైసలు లేవు. ఫైనాన్స్ తీసుకున్న దానికి కిస్తీలు కట్టడం చాలా కష్టం. ఇవన్నీ ఆలోచించి ఏండ్లుగా తన కలను చంపుకుంటూ బతుకుతున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన దళితబంధు పథకం రాజు కలను నెరవేర్చింది. ఈ పథకం కింద మంజూరైన రూ.10 లక్షలతో ఫైనాన్స్ కిరికిరి లేకుండా రాజు సొంతంగా ట్రాక్టర్ కొనుక్కున్నడు. చేతుల ట్రాక్టర్ ఉన్నదన్న ధైర్యంతో తన మూడెకరాలతో పాటు ఇంకో 20 ఎకరాలు కౌలుకు చేస్తున్నడు. తన పొలం పని అయిపోయినంక వేరే రైతులకు కిరాయికి ట్రాక్టర్ తోలుతడు. ఇలా పోయిన సంవత్సరం ఖర్చులన్నీ పోను రూ.3 లక్షలు మిగిలినయ్. ఇది రాజు ఒక్కడి కథనే కాదు. దళితబంధు అందుకున్న ప్రతి లబ్ధిదారుడిదీ రాజు లాంటి కథనే.*



# స్వయం ఉపాధికి తోవ..

# సేద్యానికి చేవ

*ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టిన దళితబంధు పథకం బహుళ ప్రయోజనాలను చేకూరుస్తున్నది. దళితుల ఆర్థిక అభ్యున్నతికి అవకాశాలను కల్పించడంతోపాటు వ్యవసాయ యాంత్రీకరణను పెంచుతున్నది. వ్యవసాయ కూలీల కొరతను తీరుస్తున్నది. వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి దారులు వేస్తున్నది. దళితబంధు మొదటి విడతలో భాగంగా ఇప్పటివరకు 40,751 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. లబ్ధిదారులంతా వారి ఇష్టప్రకారం, వారికి వచ్చిన పనికి తగ్గట్టుగా యూనిట్లను కొనుగోలు చేశారు. ఇందులో అత్యధికంగా కొనుగోలు చేసినవి వ్యవసాయ యంత్ర పరికరాలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించినవే.*

...✍ మ్యాకం రవికుమార్






## దళితబంధుతో వ్యవసాయానికి యంత్ర పుష్టి

## కేసీఆర్ దార్శనికతతో బహుళ ప్రయోజనాలు

**సీఎం కేసీఆర్** దార్శనికతతో రోజువారీ కూలిపనికి వెళ్లిన దళితులు ఇప్పుడు ఆధునిక యంత్రాలకు యజమానులుగా మారుతున్నారు. రెక్కల కష్టమే జీవనాధారంగా బతుకులను వెల్లదీస్తున్న దళితులకు యంత్ర పరికరాలపై హక్కులను కల్పిస్తున్నది 'దళితబంధు' పథకం. శ్రామికులకే యంత్ర పరికరాలపై హక్కులను కల్పించాలన్న సమసమాజ భావనలను నిజం చేస్తున్నది. దళితులకు జీవనోపాధిని చూపుతూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదపడుతుండడమే గాక రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి బాటలు వేస్తున్నది. యాంత్రిక పుష్టిని చేకూర్చుతున్నది. వ్యవసాయానుబంధ రంగాల వృద్ధికి ఊతమివ్వడమేగాక, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల విస్తరణకు ప్రోత్సహిస్తున్నది.

### వలస కూలీలు వచ్చినా చాలట్లేదు

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. రాష్ట్ర ఏర్పాటుకు పూర్వం తెలంగాణలో వానకాలం, యాసంగిలో కలిపి 1.31 కోట్ల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా, ప్రస్తుతం అది 2.02 కోట్ల ఎకరాలకు చేరుకున్నది. ఇప్పుడు వ్యవసాయం పండుగలా మారింది. ట్రాక్టర్లు, వరికోత మిషన్లు, ఇతర వ్యవసాయ యంత్రాలకు డిమాండ్ బాగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు ఎక్కువ మంది వీటినే కొనుగోలు చేశారు. ఇదే సమయంలో వ్యవసాయ కూలీల కొరత తీవ్రంగా మారుతున్నది. ఒడిశా, బీహార్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులపై ఆధారపడాల్సి వస్తున్నది.

### వ్యవసాయ అనుబంధ రంగాలు

అత్యధిక మందికి ఉపాధి అవకాశాలను కల్పించే వాటిలో వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలదే ప్రధాన పాత్ర. కోళ్ల, గొర్రెల, చేపల పెంపకం, పాడిపరిశ్రమ, కూరగాయల సాగు తదితర రంగాలపై ఇప్పటికే ఎంతో మంది ఆధారపడి జీవనోపాధిని పొందుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకం ద్వారా ఈ తరహా పరిశ్రమలు విస్తృతంగా అందుబాటులోకి వస్తున్నాయి. ఫలితంగా లబ్ధిదారులతో పాటు, మరికొంత మందికి ఉపాధి లభిస్తున్నది. గ్రామాల్లో దళితులు వ్యాపారవేత్తలుగా మారారు. మరికొందరికి ఉపాధి కల్పిస్తున్న దృశ్యాలు సాక్షాత్కరిస్తున్నాయి.

**ఇప్పటి వరకు దళితబంధు ద్వారా అందజేసిన వ్యవసాయ యంత్ర పరికరాలు**

| కేటగిరీ | యూనిట్ల సంఖ్య |
|---|---|
| ట్రాక్టర్లు | 6,475 |
| గూడ్స్ వాహనాలు | 4,809 |
| హార్వెస్టర్లు | 1,402 |
| జేసీబీ ట్రాక్టరు | 1,176 |
| వరినాటు యంత్రాలు | 136 |
| పెస్టిసైడ్, ఫర్టిలైజర్ యూనిట్లు | 140 |
| డోజర్లు | 62 |
| రొటోవేటర్స్ | 33 |
| మినీ టిల్లర్లు | 19 |
| పవర్‌వీడర్‌లు | 37 |
| సాగు యంత్రాల దుకాణాలు | 23 |

**వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు**

| కేటగిరీ | యూనిట్ల సంఖ్య |
|---|---|
| డెయిరీ ఫామ్స్ | 3,936 |
| పౌల్ట్రీ ఫామ్స్ | 656 |
| గొర్రెల యూనిట్లు | 659 |
| గోట్ రేరింగ్ | 233 |
| సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు | 14 |
| కూరగాయల సాగు | 27 |
| పశువుల దాణా ఉత్పత్తి | 56 |
| ఫిషరీస్ | 16 |
| తేనెటీగల పెంపకం | 04 |

### కూలీల కొరతకు పరిష్కారం

**వ్యవసాయం** విస్తరిస్తున్నంత వేగంగా వ్యవసాయ యాంత్రీకరణ ముందుకు సాగడం లేదు. వ్యవసాయ యాంత్రీకరణ 45 శాతానికి మించలేదు. ఇందుకు ప్రధాన కారణం పెట్టుబడి సమస్య. రెండవది చిన్న కమతాల రైతులే ఎక్కువగా ఉండడం. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకం ఆ సవాళ్లను అధిగమించేందుకు చక్కటి పరిష్కారమార్గాన్ని చూపింది. ఈ పథకం కింద దళితులు ఎంచుకుంటున్న యూనిట్లు అత్యధికంగా వ్యవసాయ యంత్ర పరికరాలే ఉంటున్నాయి. ట్రాక్టర్లు, రొటోవేటర్లు, మినీ టిల్లర్లు, వరినాటు యంత్రాలు, కోత యంత్రాలు ప్రతి గ్రామానికీ అందుబాటులోకి వస్తున్నాయి. ప్రత్యక్షంగా దళితబంధు పథకం దళితులకు జీవనోపాధిని చూపుతుండడంతో పాటు, వ్యవసాయ యాంత్రీకరణను విస్తరింపజేయడం మరో విశేషం.

### ద లీడర్ •••

# ప్రజల మనిషి పజ్జన్న

**ఉద్యమానికి బాసట • కేసీఆర్ వెంటే అడుగులు • ప్రజలతో మమేకం • అభివృద్ధిపైనే ధ్యాస**

*ఆయన ఉద్యమకారుడు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టారు. కార్పొరేటర్ పదవికి రాజీనామా చేసి, ఉద్యమ సారథి అడుగుజాడల్లో నడిచాడు. కేసీఆర్ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్నీ విజయవంతం చేశారు. ఎంతో మందిని ఉద్యమం వైపు ఉన్ముఖులను చేశారు. హైదరాబాద్ నగరంలో ఉద్యమాన్ని ఉగ్రూతలూగించారు. అతనిపై అనేక కేసులు పెట్టినా అదరలేదూ బెదరలేదు.. ఉద్యమమే ఊపిరిగా ముందుకు సాగారు. తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. దశాబ్దాలుగా ప్రజల మధ్యనే ఉంటున్న డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్‌ను నియోజకవర్గ ప్రజలు పజ్జన్న అని ఆప్యాయంగా పిలుస్తారు.*



**తీగుల్ల** పద్మారావుగౌడ్ సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లోని టకార బస్తీకి చెందినవారు. పేద కుటుంబంలో జన్మించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ రాజకీయాల్లో రాణించాడు. కేసీఆర్ చేస్తున్న ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితుడై టీఆర్ఎస్ పార్టీలో చేరారు. రైల్‌రోకో, రాస్తారోకోలను కేటీఆర్‌తో కలిసి చేశారు. ఆ సమయంలో ప్రభుత్వం ఆయనపై అనేక కేసులను పెట్టింది. అయినా.. మొక్కవోని దీక్షతో ఉద్యమంలో మమేకమై పనిచేశారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా విజయాన్ని సాధించారు. మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో ఉన్నారు.

పజ్జన్న అంటే ప్రజల మనిషి.. నిత్యం ప్రజల్లోనే ఉంటారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా పద్మారావుగౌడ్‌కు పేరు. కరోనా సమయంలో ప్రజలకు దగ్గరుండి ధైర్యం చెప్పారు. బాధితులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఆక్సిజన్ సిలిండర్‌లను అందజేశారు. పండుగలు, శుభకార్యాలు చేసుకునే నిరుపేదలకు అండగా ఉండి సాయం చేస్తారు. వృద్ధులకు చేయూతనిస్తున్నారు. ప్రజల మధ్య ఉంటూ సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నారు.



### కోట్లాది రూపాయలతో అభివృద్ధి..

"ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యం వల్ల నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చారు. అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేస్తున్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ వంటి చెక్కులను స్వయంగా లబ్ధిదారులకు అందజేస్తున్నారు. పేదలకు రెండు వేల డబుల్‌బెడ్‌రూం ఇండ్లను అందజేశారు. ఈసారి అత్యధిక మెజారిటీతో ప్రజలు పట్టం కడతారనే ధీమాతో ఉన్నారు.